జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 23-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 172 పేజీలు: 8 వెల: రూ.7

## ఆరోగ్య రక్షతో..
# పోలీసులకు సురక్ష



పోలీస్ సిబ్బంది, వారి కుటుంబాలు ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఉచిత ఆరోగ్య కార్డులను జారీ చేస్తున్నాం. జిల్లాలో హోంగార్డు నుంచి పోలీసు అధికారి వరకు అందరికీ ఆరోగ్య రక్ష కార్డు ఎంతగానో దోహదపడుతుంది. కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత బొల్లినేని భాస్కరరావు పోలీసు ఉద్యోగులకు వంద రూపాయలు కడితే ఎటువంటి అదనపు నగదు చెల్లింపులు లేకుండా ఉచిత ఆరోగ్య కార్డు ద్వారా అన్ని రకాల వైద్య పరీక్షలు, సేవలు పోలీసు సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు సర్వీస్ కాలం మొత్తం ఉచితంగా అందిస్తామని తెలపడం అభినందనీయం. ఈ వంద రూపాయాలను కూడా పోలీస్ వెల్ఫేర్ ఫండ్ కింద చెల్లిస్తాం. పోలీస్ సిబ్బందికి అన్ని రకాల మెరుగైన వైద్య సేవలను అందేలా చూస్తాం.. అని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు.

* జిల్లాలో పోలీసు సిబ్బందికి ఉచిత ఆరోగ్య కార్డులు
* ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మేలైన సేవలు
* ఈ కార్డు ద్వారా సర్వీస్ కాలం ఉచిత వైద్యం
* వంద రూపాయలు వెల్ఫేర్ ఫండ్ నుంచి చెల్లిస్తాం
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
* పోలీసు సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం
* కిమ్స్, సీఎండీ బొల్లినేని భాస్కరరావు
* కిమ్స్, జెమ్స్‌లో పోలీసు అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు






పోలీసు ఉద్యోగం అనేది నిత్యం ఒత్తిడితో కూడిన ఉద్యోగం. వారు తినే ఆహారం, పని ఒత్తిడి, మంచి నిద్రపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. వైద్య, పోలీసు వృత్తిలో ఆరోగ్య సూత్రాలు పాటించక అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారన్నారు. పోలీసు సిబ్బంది భవిష్యత్‌లో కూడా ఎటువంటి రుసుం లేకుండా ఉచిత వైద్య పరీక్షలు సేవలు అందిస్తాం. పని ఒత్తిడి తగ్గించుకొని కుటుంబ సభ్యులతో కొంత సమయాన్ని కేటాయించి ఆరోగ్యంగా ఉండాలి. ప్రతి ఒక్కరు హెల్త్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి.. అని కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత బొల్లినేని భాస్కరరావు అన్నారు.

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 22 (వార్త):** ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సౌజన్యంతో జేమ్స్, కిమ్స్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో శుక్రవారం పోలీసు అధికారులు, సిబ్బందికి రాగోలు జేమ్స్ హాస్పిటల్, శ్రీకాకుళం కిమ్స్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రాగోలు జేమ్స్ హాస్పిటల్‌లో నిర్వహించిన ఆరోగ్య రక్ష ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సిఎండి బొల్లినేని భాస్కరరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఇందులో భాగంగా హెూమ్ గార్డులు, పోలీసు సిబ్బంది, అధికారులకు బ్లడ్, షుగర్, ఈసిజి, 2డి ఎకో, తదితర పరీక్షలు చేయించుకున్నారు తోపాటు ఇతరత్రా సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా రక్షణలో పోలీసులు విధి నిర్వహణ చేస్తూ ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నారని, వైద్య పరీక్షలు నిర్వహించాలని అడగడంతో తక్షణమే స్పందించి జిల్లాలో ఉన్న 2000 పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించడానికి ముందుకు వచ్చిన కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. 24 గంటలు నిరంతరము ప్రజా సేవలకు అందుబాటులో ఉండి సేవలు అందించే విభాగాలు పోలీస్, వైద్య వృత్తి అని తెలిపారు. వంద రూపాయలతో పోలీసు సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు సర్వీస్ కాలం మొత్తం ఉచితంగా వైద్య పరీక్షలు సేవలు అందించేలా కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ముందుకు రావడంతో అభినందనీయమని చెప్పారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ హెూంగార్డుకి జిల్లాలో హాస్పిటల్ యాజమాన్యం ఉచితంగా వైద్య సేవలు పరీక్షలు అందించారని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గుర్తు చేశారు. భవిష్యత్‌లో సిబ్బంది ఆరోగ్య సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహించిన పరీక్షలు గాని అందించవలసిన వైద్య సేవలకు హాస్పిటల్ యాజమాన్యం ముందుకు వచ్చి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యం ఉన్నప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలరని అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సి.హెచ్ వివేకానంద, రాజశేఖర్, అప్పారావు, శేషాద్రి, సీఐలు, ఎస్సైలు, జెమ్స్ హాస్పిటల్ వైద్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# రెండో పంట వేయొద్దు

* ప్రాజెక్టుల్లో నీరు లేదు * జిల్లాలో వర్షాభావ పరిస్థితులు * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, నవంబర్ 22(వార్త):** వంశధార తీర ప్రాంత రైతులంతా రెండో పంట వేయవద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. వంశధార నదీ ఎగువ ప్రాంతంలోనూ, అలానే ఎగువ పరివాహక ప్రాంతంలోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్నాయని, గొట్టా బ్యారేజ్‌లో 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ఉందన్నారు. నీటి నిల్వలు చాలా తక్కువగా ఉండడంతో కాలువల ద్వారా నీటి సరఫరా చేయడం కష్టమన్నారు. వంశధార నదిలో జిల్లా శివారు ప్రాంతాలకు రెండో పంటకు అవసరమైన సాగునీటిని సరఫరా చేసేందుకు గాను నిల్వలు సరిపడినంతగా లేవని చెప్పారు. రైతులు ఈవిషయాన్ని గమనించాలని సూచించారు. తాజా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వంశధార నది పరివాహక ప్రాంత రైతులంతా ఇక్కడ రెండో పంట వేయవద్దన్నారు.




## అయ్యప్ప కొండకు..
# ఆర్టీసీ బస్సులు

4లో

* తక్కువ చార్జీలతో శ్రీకాకుళం నుంచి శబరిమలకు బస్సులు
* సామాన్యులకు అందుబాటులో టూర్ ప్యాకేజీలు

# పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యురాలిగా శిరీష



**కాశీబుగ్గ, నవంబర్ 22 (వార్త):** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యురాలిగా ఆమెను నియమించింది. అసెంబ్లీలో శుక్రవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీని ప్రకటించారు. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యురాలిగా తనను నియమించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు శిరీష ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం అందించిన అదనపు విధులను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వానికి వనరులు అందించేందుకు తన వంతుగా సహాయకారిగా ఉంటానని స్పష్టం చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నరసన్నపేట డంపింగ్ యార్డులో మంటలు

**జలుమూరు, నవంబర్ 22 (వార్త):** నరసన్నపేట డంపింగ్ యార్డులో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో మంటలు చెలరేగుతున్నాయి. రెండు రోజుల క్రిందట ఇదే పరిస్థితి నెలకొనడంతో పంచాయతీ ఈవో ద్రాక్షాయిని మంటలను అదుపు చేయించారు. 48 గంటలు కాకుండానే శుక్రవారం మళ్లీ నిప్పు పెట్టారు. ఈవో వాటర్ ట్యాంకులను రప్పించి మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు.



# ఎయిర్ పోర్టు వద్దు.. పంట భూములే ముద్దు

* ఉద్దానం రైతులు
* రాంపురంలో ప్రత్యేక సమావేశం



**మందస, నవంబరు 22(వార్త):** మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో గ్రీన్ఫీల్డ్ ఎయిర్పోర్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 1383 ఎకరాలు ఎయిర్ పోర్టు నిర్మాణానికి అవసరం కాగా, ఒక్క మందస మండలంలోని బిడిమిలో 929.61 ఎకరాలు, భేతాళపురం 94.87 ఎకరాలు, లక్ష్మీపురంలో 24.45 ఎకరాలు అవసరముగా గుర్తించారు. అయితే, ఉద్దానంలోని జీడి, మామిడి, కొబ్బరి పంటలను నమ్ముకుని జీవిస్తున్న రైతులు ఎయిర్ పోర్టును వ్యతిరేకిస్తూ శుక్రవారం మందస మండలంలోని రాంపురంలో ఉద్దానం రైతులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాంపురం, భేతాళపురం పంచాయతీలకు చెందిన రైతు నాయకులు మాట్లాడుతూ రైతులకు జీవనాధారంగా ఉన్న భూములను ఇవ్వడానికి తాము అంగీకరించడంలేదన్నారు. ఎన్నో ఏళ్లగా భూములను నమ్ముకుని, బతుకులను వెళ్లదీస్తున్నామని, వీటిని వదుకోలేమన్నారు. ఎయిర్ పోర్టు వద్దు.. పంట భూములే ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు తెప్పల ఢిల్లేశ్వరరావు, దున్న రామారావు, తామాడ తుంబనాథం, మర్ల సంతోష్కుమార్, జుత్తు జియ్యన్న, జుత్తు బాలరాజు, మహిళలు పాల్గొన్నారు.



## 430 మందికి వైద్య పరీక్షలు

**మందస, నవంబర్ 22(వార్త):** మందస మండలంలోని సిరిపురం సంతతోటలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కొర్ల కన్నారావు ఆధ్వర్యంలో రాగోలు జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన ఈ శిబిరంలో 430 మందికి బీపీ, షుగర్, గుండె, లీవర్, నరాలు, గైనిక్ తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు జరిపారు. జెమ్స్ ఆసుపత్రి వైద్యులు శివమణి, వినయ్, కుసుమ, గాయత్రి రోగులకు వైద్య సేవలు అందించారు. అవసరమైన రోగులకు ఉచితంగానే మందులు అందించారు. కార్యక్రమంలో పీఆర్వో రాపాక తిరుపతిరావు, గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు మార్పు వెంకటేశం, కొంచాడ సురేష్ కుమార్, సీపాన కరుణాకర్, బమ్మిడి ఖగేశ్, ముడిమించి మధుబాబు, తామాడ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు దశాబ్దాలుగా మత్స్యకారులకు అన్యాయం

* ప్రభుత్వాలు మారుతున్న వారి జీవితాలు మారడం లేదు
* వలసలు ఆగలంటే అభివృద్ధి జరగాల్సిందే
* ప్రైవేటీకరణను మత్స్యకారులు అడ్డుకోవాలి
* మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



**కాశీబుగ్గ, నవంబర్22(వార్త):** ప్రభుత్వాలు మారుతున్నా నాలుగు దశాబ్దాలుగా మత్స్యకారుల జీవితాల్లో మార్పు రాలేదని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండాలంటే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, వలసలు ఆగాల్సివుందన్నారు. ఆంధ్రప్రదేశ్కు చెందిన మత్స్యకారులు ఇతర రాష్ట్రాలకు వలస పోయి జీవనం సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 980 కిలోమీటర్లు సుదీర్ఘ తీర ప్రాంతం ఉందన్నారు. రాష్ట్రంలో 1950 - 60 సంవత్సరాలలో విశాఖపట్నం, కాకినాడలో నిర్మించిన హార్బర్లు మినహా మరొక నిర్మాణం లేదన్నారు. జగన్మోహనరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రంలో పది హార్బర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారన్నారు. తొమ్మిది హార్బర్లకు గాను 3666 కోట్ల రూపాయలతో మంజూరు చేయించారని చెప్పారు. కాకినాడ జిల్లాలో ఉప్పాడ హార్బర్, కృష్ణ జిల్లాలో మచిలీపట్నం హార్బర్, బాపట్ల జిల్లాలో నిజాంపట్నం హార్బర్, నెల్లూరు జిల్లాలో జువ్వలదిన్నె వద్ద గల హార్బర్ లు నిర్మాణాలు పూర్తైన దశకు చేరుకున్నాయని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో బుడగట్లపాలెం వద్ద పనులు మొదలైందని, అనకాపల్లి జిల్లాలో పూడి మడక, బాపట్ల జిల్లాలో వాడరేవు, పశ్చిమ గోదావరి జిల్లా బియ్యపుతిప్ప హార్బర్లకు టెండర్లు పూర్తయి శంకుస్థాపనలు కూడా జరిగాయని తెలిపారు. అలాగే ప్రకాశం జిల్లా కొత్తపట్నం వద్ద టెండర్లు పూర్తయి శంకుస్థాపన జరగాల్సి ఉందన్నారు. విశాఖపట్నం హార్బర్ ఆధునికీకరణకు సైతం 150 కోట్లు మంజూరు చేయించామన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి సైతం తన సుదీర్ఘ పాదయాత్రలో మత్స్యకారులు కష్టాలు వలస బతుకులు చూడడం జరిగిందన్నారు. మత్స్యకారుల వలసబాట పట్టకుండా హార్బర్ల నిర్మాణానికి ముందుకువచ్చారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పోర్టులే కాకుండా దేశంలో ఎక్కడా లేనివిధంగా హార్బర్లు నిర్మాణం, అభివృద్ధి, నిర్వహణ పేరిట ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టి ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రైవేటీకరణ చేసే ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ మెరైన్ బోర్డు కనీసం ప్రభుత్వ అనుమతి గానీ క్యాబినెట్ ఆమోదం గానీ లేకుండా నిబంధనలు అతిక్రమించి టెండర్లు ఆహ్వానించడం దారుణమన్నారు. ప్రతి మత్స్యకారుడు ఈవిషయాన్ని గమనించాలన్నారు. ప్రైవేటీకరణ నిలువరించడానికి మత్స్యకారులంతా ఏకమై ముందుకు అడుగులు వేయాలని సీదిరి అప్పలరాజు కోరారు.

## 26న శంఖారావాన్ని జయప్రదం చేయండి



**పలాస, నవంబర్ 22 (వార్త):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న ఆర్డీవో కార్యాలయం వద్ద కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు శంఖారావం జయప్రదం చేయాలని కోరుతూ కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కాశీబుగ్గ పెంట దాలయ్య ఆశ్రమం నుంచి ఇందిరా చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు ఎన్.గణపతి, సీహెచ్ వేణుగోపాల్, వంకల మాధవరావు, తామాడ సన్యాసిరావు, టి.అజయ్ కుమార్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని, స్వామీనాథన్ కమిటీ సిఫార్సులు ప్రకారం రైతు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. 26 వేలు కనీస వేతనం చెల్లించాలని, స్కీమ్ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, విశాఖ ఉక్కును కాపాడాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ధరలు అదుపు చేయాలని కోరారు. బైక్ ర్యాలీలో వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు కె.బాలాజీరావు, టి.భాస్కరరావు, ఎం.ధర్మారావు, ఆర్.దిలీప్ కుమార్, కె.కేశవరావు, ఎం.రామారావు, కె.దుష్యంత్, పి.నాగేశ్వరరావు, యస్.కుమార్, వి.పాపయ్య, కారి పురుషోత్తం, కె.గురయ్య, సి హెచ్ రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎం ప్రసాదరావు సేవలు చిరస్మరణీయం

**మందస, నవంబరు 22(వార్త):** సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. మందస మండలం ఏపీఎంగా పని చేసి, వజ్రపుకొత్తూరునకు బదిలీపై వెళ్లిన ప్రసాదరావుకు శుక్రవారం మందసలోని వెలుగు కార్యక్రమంలో ప్రస్తుత ఏపీఎం పైడి కూర్మారావు, మహిళా సంఘాలు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ప్రసాదరావు మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లారని కొనియాడారు. ఆయన ఎక్కడ పని చేసిన అంకితభావంతో పని చేస్తారని, విధులను చిత్తశుద్ధితో నిర్వహించేవారన్నారు. మహిళా అభ్యున్నతికి తనదైన శైలిలో కృషి చేశారన్నారు. ప్రసాదరావు సేవలు నిరంతం గుర్తుండిపోతాయని ప్రశంసలు కురిపించారు. ఏ మండలంలో పని చేసినా ఆ ప్రాంతంలో ఉత్తమ సేవలు అందించడమే ప్రసాదరావు ధ్యేయమన్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లి, ఆయా పథకాలకు సార్ధకత చేకూర్చుతారన్నారు. ఆయన హయాంలో మహిళా సంఘాల ఆర్థిక అభ్యున్నతి చేకూరిందన్నారు. ఈ సందర్భంగా సీసీలు, వీఓఏలు, ఎస్ఓబీలు ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సవర కాంతమ్మ, కోశాధికారి బాలక విజయశ్రీ, అకౌంటెంట్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.





## ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

**కాశీబుగ్గ, నవంబర్ 22 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డ్లో ఏపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు ఆధ్వర్యంలో వార్డు ఇంచార్జి శాసనపురి మోహన్రావుతో కలిసి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పదోవార్డు ఇన్చార్జీ చిలకమ్మ, 11వ వార్డు ఇంచార్జి చంద్రశేఖర్ త్యాడి, 12వ వార్డు ఇంచార్జి వంకల జానకిరావు, వార్డు ఇన్చార్జి కొట్ట సత్యం, అజయ్ నాయక్, టిడిపి నాయకులు ప్రధాన్, రమేష్, హరి, రాజేష్, దేవ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అలాగే వెంకటేశ్వర కాలనీలోనూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించగా, 4వ బూత్ ఇంచార్జి చంద్రశేఖర్ త్యాడి, శాసనపురి మోహనరావు, ప్రధాన్, హరి, దేవి, రాజేష్, వెంకటేశ్వర కాలనీలో టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనం పోటీల్లో జాతీయస్థాయిలో జగన్ ప్రతిభ

**మందస, నవంబరు 22(వార్త):** మందస మండలంలోని ఆదివాసీ నాయకుడు సవర జగన్ చిత్రలేఖనంలో ప్రతిభ చూపారు. ఆదివాసి వికాస పరిషత్ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జగన్కు హైదరాబాదుకు చెందిన కాసుల చిత్రకళా ఆర్ట్ అకాడమి ప్రతినిధులు అవార్డుతో సన్మానించింది. జాతీయ స్థాయిలో రామాయణం అంశాలపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో జగన్కు ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో అవార్డు పొందడం ఆనందంగా ఉందన్నారు. గిరిజన పల్లెల్లో ఉన్న తనలాంటి యువకులకు అవకాశం కల్పించడం నిజంగానే అదృష్టమన్నారు. కళాకారునిగా మరింత ప్రోత్సాహం కూడా దొరికినట్టయిందన్నారు. కాసుల పద్మావతికి ధన్యవాదాలు తెలిపారు.



## పేదలకు దుప్పట్లు పంపిణీ

**మందస, నవంబరు 22(వార్త):** మందస పరిసర గ్రామాల్లో గల పలు పేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ వూన ఈశ్వరరావు, జోనల్ ఇన్చార్జీ బమ్మిడి బైరాగి, సభ్యులు వడ్డి అప్పారావు, మద్ది ధనుంజయరావు, సాంబమూర్తి, కె.లోకనాథం, జగదీష్పండా, భరత్మహరణ, ఇప్పిలి కేశవరావు (చిట్టి), వల్లభరావు, మోహన్, శివ, కంచిబెహరా, జయకుమార్, తేజ, ప్రదీప్సాహు, సాయి, హనుమంతరావు, జగబంధు, శ్యాం, దంతం లింగరాజు, జ్యోతి, రేవతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

**సారవకోట/జలుమూరు, నవంబర్ 22(వార్త):** సారవకోట మండలం కోదడ్డపనస గ్రామంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయానికి భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని రోజు దర్శించుకుంటున్నారు. ఈ ఆలయానికి అయ్యప్ప మాలలు ధరించి వచ్చిన భక్తులు ఇక్కడ ప్రత్యేక పూజలు, హోమాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**మందస, నవంబరు 22(వార్త):** 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు ఉప్పాడ గోపాలకృష్ణ, వాయలపల్లి మురళీమోహన్ మందస మండ లంలోని హరిపురం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ మూల జోగినాయుడులకు వినతిపత్రాలను అందజేశారు. 108ని ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు.

# మాటలన్నీ వాటాల కోసమే!

*** పర్సంటేజీలు ఇవ్వకపోతే బిల్లుకు కన్నం * నీతి కబుర్లకే కొందరు ప్రజాప్రతినిధులు * పనుల్లో కొరవడుతున్న నాణ్యత * కొద్ది రోజులకే రూపు కోల్పోతున్న నిర్మాణాలు**



**సోంపేట, నవంబర్ 22 (వార్త):** ఊరు మీద పడికాదు.. ఊరు కోసం బతికేవాళ్లను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని కబుర్లు చెప్పే సర్పంచుల్లో కొందరు పంచాయతీ పరిధిలో జరిగే ప్రతీ పనికి సంబంధిత కాంట్రాక్టర్ల నుంచి 20 నుంచి 30 శాతం కమీషన్లు ఖచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తుండటంతో కొత్తగా పనులు చేసే చిన్న కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. డిమాండ్ పబ్లిక్‌గా చేస్తున్నా ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజలు ప్రశ్నించటం లేదు. దీంతో పనుల్లో నాణ్యత లేక కొద్ది నెలలుకే అవి రూపుకోల్పోతున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ప్రాప్తికి నాసిరకంగా కాకుండా, నాణ్యమైన పనులు చేయాలని సంబంధించిన శాఖ అధికారులు ఆదేశాలు ఓవైపు జారీచేస్తుంటే, పనుల్లో కమీషన్లు ఇవ్వాలని మరోవైపు కొంతమంది సర్పంచ్ ప్రతినిధులు డిమాండ్ చేయడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిగిన కమీషన్ ఇవ్వలేమంటే బిల్లులు చెల్లింపులో సైంధవుల్లా అడ్డుపడుతున్నారని సోంపేట మండలంలోని మత్స్యకార గ్రామానికి చెందిన ఓ చిరు కాంట్రాక్టు ఆవేదన. ప్రస్తుతం పల్లె పండగ పేరుతో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద ఇంచుమించు అన్ని గ్రామాలకు సిసి రోడ్లు మంజూరయ్యాయి. ఈ పనుల్లో అవినీతికి పాల్పడకుండా నాణ్యమైన పనులు చేయాలని, ఇందులో గ్రామస్తులు అంతా భాగస్వామ్యం కావాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశించారు. కొన్ని చోట్ల నిధులు చాలక పోవడంతో వంద రెండొందల మీటర్ల రోడ్డు కోసం పంచాయతీలపై ఆధారపడాల్సిన పరిస్థితిలో సర్పంచ్‌లకు రిక్వెస్ట్ చేస్తున్నారు. అయితే ఇందుకు భిన్నంగా గ్రామ స్థాయిలో కొందరు సర్పంచ్‌ల భర్తలు కమీషన్ కావాలని బరి తెగించి డిమాండ్ చేయడం దారుణంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మౌళిక సదుపాయాలు పేరుతో పంచాయతీలకు వివిధ శాఖల అధికారులు సిసి రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు పేరుతో నిధులు మంజూరు చేస్తారు. సర్పంచ్ ఆధ్వర్యంలో ఈ పనులు జరగడం వల్ల వారు చెప్పినట్లు చేయాలి. మండల స్థాయి అధికారులు పేర్లు చెప్పి పనుల్లో కమీషన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు తరచూ వింటున్నాం. వాస్తవానికి పంచాయతీ పరిధిలో జరిగే పనులు పరిశీలించడం వరకే అధికారుల పని. మరి ఈ కమీషన్ల డిమాండ్ ఎందుకు, ఇది ఎవరి కోసం, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నాణ్యమైన పనులు చేయాలంటే ఈ కమీషన్ల వల్ల నాణ్యతకు తిలోదకాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గెలిపిస్తే నీతివంతమైన పాలన అందిస్తానని ప్రజలకు భరోసా ఇచ్చే ప్రజాప్రతినిధులు ఏదోలా ఎన్నికల్లో గెలిచి కమీషన్లకు కక్కుర్తి పడటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గెలుపు కోసం ఓటర్లకు పంచిన సొమ్ములు తిరిగి సంపాదించుకోవాలనే యావతో చాలావరకు సర్పంచ్లు పంచాయతీ స్థాయిలో జరుగుతున్న పనులకు పర్సంటేజీలు తీసుకుంటూ నాణ్యత లేని పనులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెపుతున్న మాటలకు, చేస్తున్న పనులకు భిన్నమైన వ్యవహార శైలి ఉన్నప్పటికీ గ్రామాల్లో ప్రశ్నించే వారు ఎవరూ లేకపోవడంతో పాటు అడ్డు అదుపు లేకుండా పనుల్లో దోపిడీ జరుగుతుందని వివిధ వర్గాలు చెబుతున్నాయి. అధికారులు, కూటమి నేతలు ఈ వ్యవహారంపై దృష్టి సారించి ఈ కమీషన్లు డిమాండ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పంచాయతీ సమస్యలపై గ్రామ సభ

**జలుమూరు, నవంబర్ 22 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలపై అత్యవసర గ్రామ సభను ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ బూరెల్లి శంకర్రావు, ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా.. ఇటీవల ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా రోడ్ల పనులను వేగవంతం చేసే దిశగా కృషి చేయాలని సభలో తీర్మానం చేశారు.

## 'అసెంబ్లీలో అబద్ధాలు ఆపండి'




**జలుమూరు, నవంబర్ 22(వార్త):** గత ప్రభుత్వ హయాంలో జరిగిన జలుమూరు మండల అభివృద్ధిపై ఎమ్మెల్యే రమణమూర్తి అసెంబ్లీలో అబద్ధాలు మాట్లాడడం ఆపాలని ఎంపీపీ వాన గోపి, వైసీపీ మండల అధ్యక్షుడు కె.సీతారాం, శ్యామలరావు, మన్మధరావు అన్నారు. జలుమూరు మండలం చల్లవానిపేటలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కొమ్మనాపల్లి బ్రిడ్జి, జర్జంగి-పింద్రువాడ రోడ్డు, సచివాలయాలు తదితర నిర్మాణాలు మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన హయాంలోనే జరిగాయన్నారు.

## జలుమూరులో మధ్యాహ్న భోజనం పరిశీలన



**జలుమూరు, నవంబర్ 22 (వార్త):** పాఠశాల మధ్యాహ్న భోజన పథకంలో అలసత్వం తగదని జలుమూరు ఎంఈవో బమ్మిడి మాధవరావు సూచించారు. జలుమూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంఈవో ఆదేశించారు. ఆయన వెంట హెచ్ఎం వేణుగోపాలరావు ఉన్నారు.

## 'మలేరియా వ్యాధి నివారణకు చర్యలు ముమ్మరం'



**జలుమూరు/నరసన్నపేట, నవంబర్ 22(వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలో మలేరియా వ్యాధి ప్రబలుతున్న తరుణంలో నివారణ చర్యలు చేపట్ట డం జరుగుతున్నదని శ్రీకాకుళం సబ్ యూనిట్ మేనేజర్ కొణతల సూర్య భాస్కరరావు తెలిపారు. శుక్రవారం నరసన్నపేట మేజర్ పంచాయతీలోని పలు మురుగు కాలువలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో మలేరియా నివారణ మందులను పిచికారి చేయాలని ఆదేశించారు. ఆయనతోపాటు స్థానిక ఎంపీడీవో మధుసూదనరావు పాల్గొన్నారు.

## షట్టర్లపై రైతుల ఆవేదన

**జలుమూరు, నవంబర్ 22(వార్త):** వంశధార సాగునీటి కాలువ ద్వారా రైతులకు అందించవలసిన సాగునీరుకు సంబంధించి పలు కాలువల వద్ద షట్టర్లు లేకపోవడంతో వృధాగా నీరు పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. కుంభకోణం పేరుతో సాగునీటి కాలువలకు వేయవలసిన షట్టర్లు వేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయితే ఈ షట్టర్లు మాత్రం స్థానిక వంశధార కాలనీలో ఉన్నప్పటికీ నేడు తుప్పుపట్టి స్థితికి చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.






## లైంగికదాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

మెళియాపుట్టి, నవంబర్ 22 (వార్త): ప్రేమ పేరుతో విశాఖలో విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన వారిని శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నాడు చాపరలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు రోజుల క్రితం విశాఖ నగరంలో న్యాయ విద్యార్థినిని అత్యాచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా మహిళలు విద్యార్థులు ప్రజలు సంఘటితంగా పోరాడవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా సిఐటియు నాయకులు, మహిళా సంఘాలు, మహిళలు, ప్రజలు తదితరులున్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన



**కాశీబుగ్గ,నవంబర్ 22(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 9వ వార్డులో శుక్రవారం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రజల కోరిక మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీష ఇక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అందువల్ల ప్రజలందరికి అనువైన స్థలాన్ని పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 9,10,11,12 వార్డుల ఇంచార్జులు శాసనపురి మోహనరావు, హెచ్ చిలకమ్మ, చంద్రశేఖర్ త్యాడి, వంకలు జానకిరావు, రమేష్ ప్రధాన్ పాల్గొన్నారు.

## ఏఈఓలుగా వ్యవసాయ సహాయకులకు పదోన్నతి

**జలుమూరు, నవంబర్ 22 (వార్త):** నరసన్నపేట మండలంలోని స్థానిక గ్రామ వ్యవసాయ సహాయకులు పదోన్నతులు పొందడం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారిని సునీత తెలిపారు. శుక్రవారం నరసన్నపేటలోని ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ.. వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తున్న తంగి శ్రీనివాస్, పోగోటి శిరీష, మధు కిరణ్‌లకు ఏఈవోలు గా పదోన్నతి కల్పిస్తూ జేడీ త్రినాథ స్వామి ఉత్తర్వులు జారీ చేశారని తెలియజేశారు. ఈ మేరకు వీరిని ఈదులవలస, నడగాం, తిలారుకు బదిలీ చేసినట్లు తెలిపారు.

## బ్యాంక్ గ్యారంటీలను అందించండి



**జలుమూరు, నవంబర్ 22(వార్త):** మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీలను సకాలంలో అందజేయాలని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం నరసన్నపేట మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక మండల రైసు మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేవీ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు రైతులకు సహకరించాలని ఆయన సూచించారు. మిల్లర్లు మాట్లాడుతూ.. రైతులకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు.

## 'ప్రతి ఇంటికి జియో టాగింగ్ తప్పనిసరి'

**జలుమూరు, నవంబర్ 22(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటి యొక్క వివరాలను సేకరించే దిశగా జియో టాగింగ్ ముమ్మరంగా చేపట్టడం జరుగుతుందని నరసన్నపేట ఈవోపీఆర్డి రేణుక తెలిపారు. శుక్రవారం ఈ మేరకు నరసన్నపేట మండలంలో పలు పంచాయితీలలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేందుకు గాను ఈ ప్రక్రియను చేపట్టడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు.



# సంగాంలో పూజలు



**వంగర, నవంబర్22 (వార్త):** సంగాంలోని సంగ మేశ్వర స్వామి ఆల యంలో శుక్ర వారం ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతిరావు ఆధ్వ ర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మహన్యాస పూర్వక రుద్రా భిషేకం, క్షీరాభిషే కం, బిల్వదల నక్షత్రదీపారాధన, పుష్ప రుద్రాక్ష అలంకరణ చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగ కుండా ఆలయ చైర్మన్  బోను ఆనందరావు, ఈవో శ్యామలరావు ఏర్పాట్లు చేశారు.

# ఫిర్యాదులను తేలికగా తీసుకోవద్దు

*** తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోండి * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**పలాస, నవంబర్ 22 (వార్త):** ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను తహశీల్దార్లు తేలికగా తీసుకోవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తహశీల్దార్లను ఆదేశించారు. సీఎం గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పలాస టి కె ఆర్ కళ్యాణ మండపంలో డివిజన్ లోని పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి నందిగాం మండలాల రెవిన్యూ, ఎంపిడిఒలు, వివిధ శాఖల అధికారులతో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.  ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహశీల్దార్ లాగిన్ కు వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో వాటిలో సమాధానం ఉంచాలన్నారు. లాగిన్ లో కంప్యూటర్ ఆపరేటర్లు తప్పుడు సమాచారం పెట్టినా దానికి తహశీల్దార్లే బాధ్యత వహించాలని, తాను కూడా తహశీల్దార్లు పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.  కొన్ని మండలాల్లో తహశీల్దార్లు తమ లాగిన్ కు వచ్చిన ఫిర్యాదులను కనీసం పట్టించుకోవడం లేదని, సీఎం గ్రీవెన్స్ కు వచ్చిన ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి సోమవారం ప్రతి మండలంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారని, ఇక్కడ సమస్య పరిష్కారం కాని పరిస్థితుల్లో తమ వద్దకు పంపించాలని, ఇక్కడ సమస్య ఇక్కడే పరిష్కరించే విధంగా చర్యలు




చేపట్టాలని, దూర ప్రాంతాల నుంచి శ్రీకాకుళం వరకు రావడం ఫిర్యాదు దారులకు ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. పరిపాలనలో రెవెన్యూ శాఖ ఎంతో ప్రధానమైనదని తమ వద్దకు వచ్చిన ఫిర్యాదు దారులకు ఇది నా పని కాదు అనే చెప్పే పరిస్థితి ఉండకూడదని గుర్తు చేశారు. అదేవిధంగా నీటి పన్ను వసూళ్లు చాలా మండలాలలో ఇంత వరకూ ప్రారంభించలేదని, మూడు వారాల్లో నీటి పన్ను వసూళ్లు పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కొన్ని కార్యాలయాలకు భవనాలు లేవని, ఉన్న భవనాలు సరిపోవడంలేదని అందువలన నూతన భవనాల కోసం తమ దృష్టికి తీసుకువస్తే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్డీవో జి వెంకటేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ గోపాలపురంలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.

**గోపాలపురం సీసీ రోడ్డు నాణ్యత పరిశీలన**

పల్లె పండుగలో భాగంగా  పలాస మండలం చినంచల పంచాయతీ రాజ గోపాలపురం గ్రామంలో రూ.36.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం పరిశీలించారు. కిలోమీటర్ పొడవుతో వేసిన రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి స్వయంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామంలోని మొత్తం ఐదు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.  పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశరావు, డిఈ రవిబాబు, క్వాలిటీ కంట్రోల్ డిఈ ప్రదీప్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## దుప్పట్లు పంపిణీ

**పలాస, నవంబర్ 22 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి లోని, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న 30మంది అభాగ్యులకు, వృద్ధులకు రెండో వార్డు పద్మనాభపురానికి చెందిన డొక్కా అజయ్  దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చలికి వణుకుతున్న వృద్ధులు, అభాగ్యులకు తనవంతు సాయంగా దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి యేటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో డొక్కరి దిలీప్ కుమార్, సునీల్ వర్మ తదితరులు పాల్గొన్నారు

## 25లోగా అర్జీల స్వీకరణ

**జలుమూరు, నవంబర్ 22 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 25వ తేదీ వరకు భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తామని నరసన్నపేట తహశీల్దార్ టి.సత్యనారాయణ తెలిపారు. గోకయ్యవలస రెవెన్యూ పంచాయతీలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భూ హక్కుల పత్రాల్లో సవరణలు చేపట్టేందుకు ఈ సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు నైపుణ్య శిక్షణ

**జలుమూరు నవంబర్ 22 (వార్త):** ఉపాధి హామీ పథకంలో భాగంగా వంద రోజులు పూర్తి చేసుకున్న వారికి ఉన్నతి పథకం ద్వారా నైపుణ్య శిక్షణ ఇస్తామని శ్రీకాకుళం జిల్లా జేసీ కృష్ణవేణి తెలిపారు. నరసన్నపేట మండలంలోని పలు పంచాయతీలను ఏపీవో కె.యుగంధర్‌తో కలిసి ఆమె శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కార్డుదారులను కలిశారు. వంద రోజులు పని అయిన తర్వాత మిగిలిన రోజుల్లో వేతనదారులకు నైపుణ్య శిక్షణ ఇస్తామని చెప్పారు.

## బొందిలి కులస్థులకు ఓబీసీ జాబితాలో చేర్చాలి



**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 22 (వార్త):** బొందిలి కులస్థులకు ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ బిజెపి ఓబీసీ మోర్చా కో కన్వీనర్ పి.సురేష్ బాబు సింగ్  విజ్ఞప్తి చేశారు. 2008లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి డా. వైస్ రాజశేఖర్ రెడ్డి బొందిలి కులస్థులను బిసి-బి జాబితాలో చేర్చార న్నారు. ఓబీసీ జాబితాలో కూడా చేర్చినట్టయితే మరిన్ని సంక్షేమ పథకాలను అందుకోగలుగుతారని చెప్పారు. ఏపీలో దాదాపుగా 5  లక్షలు పైగా బొందిలి కులస్తులు  ఉన్నారని తెలిపారు. ఈ కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చి ఆదుకోవాలని కోరారు.

## నేడు జడ్పీ సమావేశం

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 22 (వార్త):**  జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో ఎల్ఎన్‌వి శ్రీధర్ రాజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సీఈవో కోరారు.

## నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదు

**మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**



**ఎల్ఎన్‌పేట/హిరమండలం, నవంబర్ 22 (వార్త):** ప్రజా సంక్షేమం కోసం జగనన్న బటన్లు నొక్కితే వచ్చిన సొమ్ముతో మహిళలు గంజాయికి బానిసలు అయ్యారని మంత్రి సవిత మాట్లాడడాన్ని ఖండిస్తున్నానని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఒక మహిళ మంత్రి అయివుండి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోరి అన్ని వర్గాల ప్రజలకు ఎటువంటి తారతమ్యాలు చూడకుండా బటన్ నొక్కి ప్రజలకు ఆర్థిక సహాయం అందించి వారే ఆర్థిక పురోభివృద్ధికి సహకారం అందిస్తూనే.. వారి ఇళ్లల్లో వెలుగులు నింపిన గొప్ప ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఆమె అన్నారు. మహిళా సాధికారత, అభ్యున్నతి, అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, రక్షణ, భద్రత మహిళలకు జగనన్న ప్రభుత్వంలో ఎవరి దగ్గర తలదించకుండా, చేయి చాపకుండా ఆర్థిక భరోసా ధైర్యం డైరెక్ట్‌గా బటన్ నొక్కి మహిళా అభ్యున్నతే ధ్యేయంగా జగనన్న పాలన జరిగిందన్నారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా చేయూత, అభివృద్ధి, భరోసా ఇస్తూ పొదుపు సంఘాలను మహిళలకు జగనన్న ప్రభుత్వంలో అగ్రస్థానంలో నిలిచాయన్నారు. ఇవన్నీ నిర్వీర్యం చేసింది కాక తిరిగి మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడడం సిగ్గుచేటని, ఇచ్చిన హామీలను నిలబెట్టు కునే శక్తి లేని కూటమి ప్రభుత్వం తప్పించుకోవడానికి పనికిమాలిన మాటలాడితే మహిళలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఇటువంటి వ్యాఖ్యలు చేసినందుకు మంత్రి సవిత మహిళలందరికీ క్షమాపణలు చెప్పాలన్నారు.

## చెరుకు పంట దగ్ధం

**జలుమూరు/నరసన్నపేట, నవంబర్22 (వార్త):** నరసన్నపేట మండలం లోని మాకివలస గ్రామంలో కోత దశలో ఉన్న ఏడెకరాల చెరకు పంటకు మంటలు అంటుకున్నాయి. బోడి రామారావుకు చెందిన 5 ఎకరాలు, యళ్ల ప్రసాదరావుకు చెందిన 2 ఎకరాలు పంట కాలి బూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కరెంట్ వైర్ల నుంచి నిప్పులు చెలరేగి పంటపై పడటంతో ప్రమాదం జరిగినట్లు పలువురు భావిస్తున్నారు.



అయ్యప్ప కొండకు..

# ఆర్టీసీ బస్సులు

*** తక్కువ చార్జీలతో శ్రీకాకుళం నుంచి శబరిమలకు బస్సులు**

*** సామాన్యులకు అందుబాటులో టూర్ ప్యాకేజీలు**

**శ్రీకాకుళం, నవంబర్ 22 (వార్త):** శ్రీకాకుళం జిల్లా నుంచి శబరిమల అయ్యప్పకొండకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది. ఈ ఏడాది కూడా శబరిమల వెళ్లే అయ్యప్పస్వాములకు అతి తక్కువ చార్జీలతో టూర్ ప్యాకేజీ అందిస్తున్నారు. శబరిమలకు వెళ్లే భక్తులు బస్సు మొత్తం లేదా విడివిడిగా టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్ బస్సులు అందుబాటులో ఉంచారు. బస్సు మొత్తం బుక్ చేసుకుంటే ఏడుగురికి ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. సూపర్ లగ్జరీలో ప్రయాణించే భక్తులకు ఆడియో, వీడియో సౌకర్యం ఉంటుంది. బస్సును అద్దెకు బుక్ చేసుకునే గురుస్వాములకు, ఏజెంట్లకు (మినిమం 5 రోజులు) రూ.2000 కమీషన్ ఇవ్వనున్నారు. బస్సును అద్దె ప్రాతిపదికన బుక్ చేసుకొన్న వారికి చివరి రోజు 12 గంటలు ఉచితం ప్రయాణం కల్పిస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ చెప్పారు. 5 రోజులు ప్యాకేజీ టూర్ కు - శ్రీకాకుళం నుంచి రానుపోను ఛార్జీలు (ఒక్కొక్కరికి) సూపర్ లగ్జరీ రూ.7,000, అల్ట్రా డీలక్స్- రూ.7,000 అని చెప్పారు. విజయవాడ, మేల్ మరవత్తూర్, ఎరుమేలి, పంబ మీదుగా సన్నిధానానికి చేరుకుంటుందని చెప్పారు. వచ్చేటప్పుడు శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, విజయవాడ మీదుగా శ్రీకాకుళం చేరుకుంటారన్నారు.  అలాగే ఆరు రోజులు ప్యాకేజీ టూర్ కు గాను శ్రీకాకుళం నుంచి రానుపోను ఛార్జీలు (ఒక్కొక్కరికి) సూపర్ లగ్జరీ రూ.7,400, అల్ట్రా డీలక్స్ రూ.7,400 ఉంటుందన్నారు. విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, పంబ మీదుగా వెళుతుందని, వచ్చేటప్పుడు తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, అన్నవరం మీదుగా శ్రీకాకుళం చేరుకుంటారున్నారు. 7 రోజులు ప్యాకేజీ టూర్‌కు శ్రీకాకుళం నుంచి రానుపోను ఛార్జీలు (ఒక్కొక్కరికి) సూపర్ లగ్జరీకి రూ.8,000, అల్ట్రా డీలక్స్ రూ.8,000, ఉంటుందన్నారు. విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, ఫళని, ఎరుమేలి. పంబ మీదుగా సన్నిధానం చేరుకుంటారని,  వచ్చేటప్పుడు మదురై, రామేశ్వరం, తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, ద్వారపూడి, అన్నవరం మీదుగా శ్రీకాకుళం వస్తారన్నారు. అలాగే అయ్యప్ప భక్తులు కోరుకున్న మార్గంలో దర్శనానికి వెళ్లడానికి ప్రత్యేక ప్యాకేజీ- ఒక కి.మీ.కు ఛార్జీగా సూపర్ లగ్జరీ - రూ.57, అల్ట్రా డీలక్స్ - రూ.61, ఎక్స్ ప్రెస్ - రూ.62లని తెలిపారు. అద్దె ప్రాతిపదికన రోజుకు 420 కి.మీ ప్రకారం ఛార్జీలు లెక్కించబడుతుందన్నారు. 36 మంది భక్తులు ఉంటే వారికి అనుకూలమైన తేదీలలో బస్సు అద్దెకు ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9959225608, 9959225609, 7382921647, 7382917289, 7382924758, 7382923311 నంబర్లకు సంప్రదించాలని విజయకుమార్ కోరారు.

**శబరిమలకు బయలుదేరిన బస్సు..**

శబరిమలకు శుక్రవారం ఆర్టీసీ బస్సు భక్తులతో బయలుదేరగా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో 1, 2 డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కెఆర్ఎస్ శర్మలు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, గంగరాజు, ప్రసాద్, ఎం.పీ.రావు, రాజు , సెక్యూరిటీ విభాగం పాల్గొన్నారు.





Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546